సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 30 । జనవరి । 2024



రూ.50 వేల విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వాసవీ నిత్య అన్నదాన ట్రస్టు చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం రూ.50 వేల విరాళం అందించారు.



ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

పి.గన్నవరం: ముంగండలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి నందెపు వెంకటేశ్వర రావు, విజయలక్ష్మి దంపతులు రూ.5,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 10,950 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 10,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 8.80 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూములోని సామగ్రి తీసుకోవాలి



జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ట్రెజరీ స్ట్రాంగ్ రూములో ఉన్న వివిధ కార్యాలయాలకు చెందిన 34 వస్తువులను వెంటనే వెనుకకు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, స్ట్రాంగ్ రూమ్ పర్యవేక్షణ జిల్లా నోడల్ అధికారి **ఎస్.తేజ్‌భరత్ ఆదే**శించారు. సంబంధిత శాఖల అధికారులకు కలెక్టరేట్‌లో ఆయన సోమవారం పలు సూచనలు చేశారు. దీర్ఘకాలికంగా జిల్లాలోని 15 శాఖలకు చెందిన 79 వస్తువులు స్ట్రాంగ్ రూములో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే ఆయా శాఖలకు సంబంధించిన వివరాలు తెలియజేశామని తెలిపారు. మొత్తం 49 వస్తువులను స్ట్రాంగ్ రూము నుంచి ఉపసంహరించాల్సి ఉండగా ఇప్పటికే 15 వస్తువులను ఆయా శాఖలు వెనుకకు తీసుకున్నాయని అన్నారు. ఇంకా ఇరిగేషన్ 18, పోలీస్ 5, పంచాయతీరాజ్ 2, రెవెన్యూ 6, ఆర్అండ్‌బీ, దేవదాయ, న్యాయ శాఖలకు చెందిన 34 వస్తువులు ఉన్నాయని తెలిపారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని జేసీ తేజ్‌భరత్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, సహాయ ట్రెజరీ అధికారి కె.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజిలెన్స్ ఎస్పీగా సుబ్బారెడ్డి

కంబాలచెరువు: జిల్లా విజిలెన్స్ ఎస్పీగా కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్రంలో ఎస్పీల బదిలీలో భాగంగా సోమవారం రాత్రి ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

శ్రీవారికి కాసుల పంట

32 రోజులకు హుండీల ఆదాయం రూ.3.34 కోట్లు

ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గడచిన 32 రోజులకు గాను నగదు రూపేణా స్వామి వారికి రూ.3,34,81,330 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు 418 గ్రాముల బంగారం, 14.660 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ సమర్పించారని వివరించారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500 నోట్ల రూపంలో రూ.2,37,500 లభించాయని చెప్పారు.

4 వరకూ కులగణన సర్వే

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కులగణన సర్వే గడువును వచ్చే నెల 4వ తేదీ వరకూ పొడిగించారని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి వివిధ అంశాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే జిల్లాలోని 9,456 క్లస్టర్లలో 6,54,491 కుటుంబాలకు గాను 5,77,093 (88.17 శాతం) కులగణన సర్వే పూర్తయ్యిందని తెలిపారు. నిర్దేశిత సమయంలోగా నూరు శాతం పూర్తి చేయాలని అన్నారు. ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేయాలని, జిల్లా స్థాయికి ఎంపికైన విజేతలు పోటీల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీటట్.. ఫైటట్..

- రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై వీడని పీటముడి
- పోటీపై జనసేన నేత దుర్గేష్ డైలమా
- శ్రేణుల ఒత్తిడితో చివరకు బరిలోకి దిగాలని నిర్ణయం
- తాజా పరిస్థితుల్లో సిటీపై రూరల్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల కన్ను
- దీంతో ఆదిరెడ్డి వర్గంలో టెన్షన్
- స్పష్టత ఇవ్వని చంద్రబాబు

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ – జనసేన పార్టీలకు సంబంధించినంత వరకూ రాజమహేంద్రవరం రూరల్ రాజకీయం రంజుగా మారుతోంది. ఇక్కడి ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న పీటముడి ఇంకా వీడటం లేదు. ఇక్కడి నుంచి తాను పోటీ చేస్తానని జనసేన నుంచి ఆ పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్.. కాదు కాదు.. ఈ సీటు తనదేనంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇప్పటికే ప్రకటించుకున్నారు. ఈ పరిస్థితుల్లో రూరల్ సీటు కేటాయింపుపై రెండు పార్టీల శ్రేణుల్లోనూ సస్పెన్స్ ఏర్పడింది. ముందుగా ప్రకటించుకున్నట్టు దుర్గేష్ పోటీ చేస్తారా.. లేక గోరంట్లకు వదిలేస్తారా అనే విషయం ఎటూ తేలడం లేదు. ఇటీవల మండపేటలో పోటీ చేస్తామని చంద్రబాబు ప్రకటించిన వెంటనే.. రాజానగరం, రాజోలు నియోజకవర్గాల్లో పోటీపై పవన్ కల్యాణ్ కూడా హడావుడిగా ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అయితే, రాజమహేంద్రవరం రూరల్ విషయానికి వచ్చేసరికి చంద్రబాబు స్పష్టత ఇవ్వడం లేదు. పవన్ కల్యాణ్ నోరు మెదపడం లేదు. దీంతో రెండు పార్టీల్లోనూ గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

ఓసారి సై.. మరోసారి నైనై..

ఇదిలా ఉండగా జనసేన నేత దుర్గేష్ ఊగిసలాట ధోరణి ప్రదర్శిస్తున్నారంటూ ఆ పార్టీ శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. కాసేపు పోటీ చేస్తానని, మరికాసేపు పోటీ చేయనని ఆయన సంకేతాలిస్తున్నారు.

జనసేన – టీడీపీ పొత్తులో భాగంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రూరల్ స్థానం నుంచి దుర్గేష్ బరిలోకి దిగడం ఖాయమని తొలుత సంకేతాలు వెలువడ్డాయి. ఆయన సైతం నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి తానే అభ్యర్థినని ప్రకటించుకుని, ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. అంతలోనే ఆయన మనసు మార్చుకున్నారని తెలుస్తోంది. ఆర్థిక పరిస్థితులు, వ్యక్తిగత సమస్యల కారణంగా రానున్న ఎన్నికల్లో పోటీకి విముఖత చూపుతున్నారని చెబుతున్నారు. దీంతో రూరల్ రాజకీయం తాజాగా మరో మలుపు తిరిగింది. వాస్తవానికి రూరల్ సీటు మరోసారి ఆశిస్తున్న టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల, దుర్గేష్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకాకుండా ఈ ఇద్దరు నేతలూ రహస్యంగా కలిసి చర్చించుకుని, ఓ నిర్ణయానికి వచ్చారని, అప్పటి నుంచే ఎన్నికల్లో పోటీకి దుర్గేష్ సుముఖంగా లేరన్న వాదన వినిపిస్తోంది. ఇదే అదునుగా బుచ్చయ్య చౌదరి తన ఎమ్మెల్యే స్థానం తనకే పదిలమని, రూరల్ సీటును తన నుంచి దూరం చేసే దమ్ము ఎవరికైనా ఉందా? అంటూ ఆవేశంతో ప్రకటనలు కూడా చేశారు. తాను ఎమ్మెల్యేగా మరోసారి గెలుపొంది, మంత్రి కావడం ఖాయమనే లెక్కలు వేసుకునేంత వరకూ వెళ్లారాయన.



నేతల ఒత్తిడితో మళ్లీ సై

పోటీకి దుర్గేష్ దూరమవుతున్న సంగతి తెలుసుకున్న రూరల్ నియోజకవర్గ జనసేన నేతలు ఆయనపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. సువర్ణ అవకాశాన్ని ఎందుకు పోగొట్టుకుంటున్నారని వాదనకు దిగారు. 'ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలన్న మీ కలను మీరే నాశనం చేసుకుంటారా?' అని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులు నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నా దుర్గేష్ ససేమిరా అని భీష్మించారు. 'మీరు చేయకపోతే మరో నేతను రంగంలోకి దింపుతాం. అంతే కానీ సీటు మాత్రం త్యాగం చేసుకునే పరిస్థితి తీసుకురాం' అని స్పష్టం చేశారు. స్వపక్ష నేతల ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అయిన దుర్గేష్ ఆత్మరక్షణలో పడ్డారు. పార్టీ శ్రేణులను విస్మరిస్తే రాజకీయ భవిష్యత్తు సమాధి అయ్యే ప్రమాదం ఉండటంతో దిక్కుతోచని పరిస్థితిలో చేసేది లేక పోటీకి సై అన్నారు.

సిటీపై గోరంట్ల కన్ను

దుర్గేష్ తాజా నిర్ణయంతో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల గొంతులో పచ్చి వెలక్కాయ అడ్డం పడినట్టయ్యింది. ఈ పరిస్థితుల్లో ఆయన ప్రత్యామ్నాయ ఆలోచనలో పడ్డారు. రూరల్ చేజారిన పక్షంలో తనకు అనువైన రాజమహేంద్రవరం సిటీలోనైనా పాగా వేయాలని ప్రయత్నిస్తున్నారు. అందుకు అవసరమైన వ్యూహరచన చేస్తున్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై చంద్రబాబు వద్ద తాడోపేడో తేల్చుకోవాలని సిద్ధమవుతున్నారు.

ఆదిరెడ్డి వర్గంలో అలజడి

ఉరుము ఉరిమి మంగలం మీద పడినట్టు.. రూరల్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి తమ ఆశలకు ఎసరు పెడుతుందేమోనని మరోసారి రాజమహేంద్రవరం సిటీ సీటు ఆశిస్తున్న ఆదిరెడ్డి అప్పారావు వర్గం ఆందోళన చెందుతోంది. తన కుమారుడు వాసును ఎమ్మెల్యేగా చూడాలన్నది ఆదిరెడ్డి అప్పారావు కల. దీనికోసమే ఆయన తన కోడలు, ప్రస్తుత ఎమ్మెల్యే భవానీని ప్రజలకు దూరం పెట్టారు. ఆమె బదులు ఆమె భర్త, తన తనయుడు వాసు ప్రజల్లో ఉండేలా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తన కలను గోరంట్ల నాశనం చేస్తారేమోనని అప్పారావు అంతర్మథనం చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ స్థానంపై ఏదో ఒకటి తేల్చుకునేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు వద్ద పంచాయతీ పెట్టారు. 'టీడీపీలో నా పరిస్థితే ప్రశ్నార్థకంగా మారింది. ఇంక మీకేం చేయగలను? మీ స్థాయిలో మీరు చూసుకోండి' అంటూ అచ్చెన్నాయుడు చేతులెత్తేయడంతో ఆదిరెడ్డి వర్గం ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ప్రస్తుతం ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. స్కిల్ స్కామ్‌లో అరెస్టయి, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబు ఉన్న సమయంలో ఆయన కుటుంబానికి ఆదిరెడ్డి కుటుంబం వెన్నంటి నిలిచింది. లోకేష్‌తో ఆదిరెడ్డి వాసు సన్నిహిత సంబంధాలు నెరిపి, ఆయన దృష్టిలో పడ్డారు. ఆ నేపథ్యంలో ఇక తనకు ఎవరూ అడ్డురారన్న ధైర్యంతో సిటీలో పర్యటనలు మొదలు పెట్టారు. ఇటువంటి సమయంలో బుచ్చయ్య ప్రయత్నాలు ఆదిరెడ్డి కుటుంబంలో అలజడి రేపుతున్నాయి. ఈ పరిణామం ఎటువైపు దారితీస్తోందనని, చివరకి తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని ఆదిరెడ్డి వర్గం ఆందోళన చెందుతోంది. రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజకవర్గాల్లో నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితులపై కాతేరులో సోమవారం నిర్వహించిన రా.. కదలిరా సభలో సైతం చంద్రబాబు ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఆయన ఉదాసీన వైఖరితో ఇరు వర్గాల మధ్య విభేదాలు మరింతగా భగ్గుమంటున్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

- ఉమ్మడి జిల్లాకు రూ.27.59 కోట్లు మంజూరు
- గ్రామాల్లో ఊపందుకోనున్న అభివృద్ధి పనులు

కాకినాడ సిటీ: జిల్లా, మండల పరిషత్తులకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను కేంద్రం విడుదల చేసింది. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు కలిపి రూ.27,58,69,755 విడుదలయ్యాయి. వీటిల్లో 70 శాతం గ్రామ పంచాయతీలకు, 15 శాతం మండల పరిషత్‌లకు, మిగిలిన 15 శాతం జిల్లా పరిషత్‌కు కేటాయిస్తారు. ఈ నిధులు జెడ్పీ, మండల పరిషత్‌ల ఖాతాల్లో జమ కావడంతో మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. జిల్లా పరిషత్‌కు టైడ్ గ్రాంటుగా రూ.10,48,95,197, బేసిక్ గ్రాంటుగా రూ.6,99,30,410 విడుదలయ్యాయి. పూర్వపు అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలోని 64 మండలాలకు సంబంధించి టైడ్ గ్రాంటుగా రూ.10,09,76,475, బేసిక్ గ్రాంటుగా రూ.6,73,15,358 విడుదలయ్యాయి. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక అవసరాలకు పెద్ద పీట వేయనున్నారు. టైడ్ గ్రాంట్‌కు సంబంధించిన నిధుల్లో 50 శాతం తాగునీటి అవసరాలకు వెచ్చించాలి. వేసవి రాక ముందే గ్రామ, మండల, జెడ్పీలకు ఈ నిధులు విడుదలవడం వల్ల పల్లెల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా వివిధ పనులు చేపట్టే అవకాశం ఏర్పడింది. అలాగే బేసిక్ గ్రాంట్‌తో సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

ఆయా జిల్లాల్లోని మండలాలకు విడుదలైన నిధులు (రూ.లలో)

జిల్లా	బేసిక్ గ్రాంట్	టైడ్ గ్రాంట్
కాకినాడ	2,23,17,074	3,29,57,334
కోనసీమ	2,39,06,360	3,58,61,034
తూర్పు గోదావరి	1,87,33,332	2,42,61,448

మండల పరిషత్‌లకు సర్దుబాటు



15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు, మొదటి విడతకు సంబంధించిన వడ్డీ కలిపి ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని 64 మండల పరిషత్‌లకు సర్దుబాటయ్యాయి. జెడ్పీకి విడుదలైన రూ.17.48 కోట్ల నిధులను చైర్మన్ అనుమతితో తాగునీటి అవసరాలు, అభివృద్ధి పనులకు వెచ్చించనున్నాం.

– ఎ.రమణారెడ్డి, జెడ్పీ సీఈఓ

చంద్రబాబూ.. నిరూపిస్తావా!

- ఒక్క ఆరోపణ నిరూపించినా రాజకీయాలు వదిలేస్తా
- నీకు దమ్ముంటే లోకేష్‌ను నాపై పోటీకి దింపు
- ఎంపీ భరత్‌రామ్ ధ్వజం

రాజమహేంద్రవరం రూరల్: స్కీముల పేరుతో భారీ స్కాములు చేసి అడ్డంగా దొరికిపోయి, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వెళ్లిన చంద్రబాబుకు తనను విమర్శించే అర్హత లేదని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. కాతేరు సభలో చంద్రబాబు తనపై చేసిన ఆరోపణల్లో ఒక్కటైనా నిరూపించగలరా అని సవాల్ విసిరారు. సోమవారం రాత్రి ఎంపీ భరత్‌రామ్ విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన ఆరోపణలను ఖండించారు. తాను నీతిగా, నిజాయితీగా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, చంద్రబాబు, టీడీపీ నాయకుల్లా రాజకీయాలను అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదించడానికి కాదని అన్నారు. రాజమహేంద్రవరంలో మీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు వడ్డీ వ్యాపారాలు, చీట్ల వ్యాపారాలు చేసి అడ్డంగా దొరికి, సెంట్రల్ జైలులో ఉండి వచ్చారని అన్నారు. 'ఆవ భూముల్లో నాకు రూ.150 కోట్లు ఎవరిచ్చారు? దానిని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని చాలెంజ్ విసిరారు. 'వైఎస్సార్ ఆసరా పథకం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 80 లక్షల మంది మహిళలకు రూ.25 వేల కోట్లు ఇచ్చారు, నువ్వు ఇవ్వగలవా?' అని ప్రశ్నించారు. దమ్ముంటే తనపై చంద్రబాబు కుమారుడు లోకేష్‌ను పోటీకి దింపాలని సవాల్ విసిరారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు అంటున్నారని, ఆ స్కీమ్ జన్మభూమి కమిటీలకు, టీడీపీ కార్యకర్తలకు తప్పిస్తే రాష్ట్రంలోని అర్హులైన వారికి కాదనే సంగతి అందరికీ తెలుసునని అన్నారు. స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఇన్‌సైడర్ ట్రేడింగ్, పోలవరం ప్రాజెక్టు నిధుల స్వాహా.. ఇలా ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు తనను విమర్శించే అర్హత లేదని అన్నారు. రాజమహేంద్రవరాన్ని రెండున్నరేళ్లలో ఎలా అభివృద్ధి చేశానో చూడాలని హితవు పలికారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

పోలీసు స్పందనకు 20 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదీల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలపై జోనల్ డీఎస్పీల సమక్షంలో ముఖాముఖి మాట్లాడారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, చోరీ, చీటింగ్ కేసులపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపించి, సమస్యలను తక్షణమే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు స్పందనకు సివిల్ 11, కుటుంబ కలహాలు 2, చీటింగ్ 4, ఇతరు ఫిర్యాదులు 7 చొప్పున అందాయి.

స్పందనకు 186 అర్జీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 186 అర్జీలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో 164, ఆఫ్‌లైన్‌లో 22 చొప్పున అర్జీలు వచ్చాయని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ 71, పంచాయతీరాజ్ 33, పోలీస్ 15, విద్యుత్ 12 చొప్పున ఉన్నాయని వివరించారు. వీటిని నిర్ణీత కాలవ్యవధి లోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

డీవార్మింగ్ డే విజయవంతం చేయాలి

పిల్లల్లో నులి పురుగు నివారణకు ఉద్దేశించిన డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. వచ్చే నెల 9, 16 తేదీల్లో జరిగే నులిపురుగుల నివారణ దినంపై (డీవార్మింగ్ డే) వైద్య, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. నులిపురుగు నివారణ కోసం వైద్య, ఆరోగ్య అధికారులు, సిబ్బంది తీసుకునే చర్యలకు ప్రజలు, విద్యార్థులు సహకరించాలని కోరారు. డీవార్మింగ్ డే ప్రాధాన్యంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు, సంరక్షకులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు.



దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

అందరి భాగస్వామ్యంతో జిల్లాను కుష్ఠు వ్యాధి రహితంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా మంగళవారం నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకూ నిర్వహించే 'స్పర్శ – అవగాహన పక్షోత్సవాల' వాల్‌పోస్టర్‌ను ఆమె సోమవారం ఆవిష్కరించారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, టూరిజం ఆర్‌డీ వి.స్వామి నాయుడు, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పండగ

- రేపు జేఎన్‌టీయూకే, నన్నయ వర్సిటీల స్నాతకోత్సవాలు
- కులపతి హోదాలో పాల్గొంటున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ రాజన్నకు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి గౌరవ డాక్టరేట్లు
- జేఎన్‌టీయూకేలో 28 మందికి, 'నన్నయ'లో 12 మందికి బంగారు పతకాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/రాజానగరం: పట్టభద్రులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే పట్టాల పండగ మరొక్క రోజులోనే జరగనుంది. కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూకే), రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల్లో బుధవారం స్నాతకోత్సవాలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల, ఆయా వర్సిటీల అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఈ స్నాతకోత్సవాల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కులపతి హోదాలో పాల్గొంటున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన **షెడ్యూల్ ఖరారైంది. జేఎన్‌టీయూకేలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, నన్నయ వర్సిటీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే స్నాతకోత్సవాల్లో గవర్నర్ పాల్గొంటారు.**

జేఎన్‌టీయూకే 9వ స్నాతకోత్సవానికి అధికారులు గత ఏడాది నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా 2023–24 విద్యా సంవత్సరంలో పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు. బీటెక్‌లో 34,199, బీఆర్క్ 13, బీ ఫార్మసీ 1,477, ఎంటెక్ 1,689, ఎంబీఏ 1,093, ఎంసీఏ 343, ఎం ఫార్మసీ 332, బీబీఏ 21, ఫార్మాడీ 182, ఒరిజనల్ డిగ్రీలను విద్యార్థులకు ప్రదానం చేస్తారు. వీటితో పాటు 28 మందికి బంగారు పతకాలు, 64 మందికి పీహెచ్‌డీలు అందజేస్తున్నారు. ఈసారి టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ రాజన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయాలని నిర్ణయించారు. ఈ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథులుగా గవర్నర్ నజీర్‌తో పాటు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పూర్వ విద్యార్థి, భారత నౌకాదళ రిటైర్డ్ అధికారి ఎస్‌వీఎస్ చారి (1973, ఈసీఈ), ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి పాల్గొంటారు. గవర్నర్ పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యాన రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు పర్యవేక్షిస్తున్నాయి. దీనికోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వర్సిటీ ఆవరణ **తో పాటు పరిసరాల్లో పోలీసు నిఘా ఉంచనున్నారు.**

'నన్నయ'లో ఏర్పాట్లు పూర్తి

ఆదికవి నన్నయ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కరోనా పరిస్థితుల అనంతరం జరగాల్సిన 13, 14 స్నాతకోత్సవాలను కూడా కలిపి దీనితో నిర్వహిస్తున్నారు. 2019–20, 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పట్టాలు ప్రదానం చేస్తారని వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. డిగ్రీ పట్టాలు పొందేందుకు 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్‌కు 12 మంది ఎంపికయ్యారు. ఈ మూడు విద్యా సంవత్సరాల్లో పీజీలు చేసిన 50,173 మంది పట్టాలను కూడా గవర్నర్ ఆమోది**స్తారని వీసీ పద్మరాజు తెలి**పారు. ఇటీవల డీ.లిట్ పొందిన నందమూరి లక్ష్మీపార్వతి కూడా పట్టా అందుకునేందుకు హాజరు కానున్నారు. వర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే స్నాతకోత్సవంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, యాప్సీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో స్నాతకోత్సవ ఏర్పాట్లను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సోమవారం పరిశీలించారు. స్నాతకోత్సవం జరిగే ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, అదనపు ఎస్పీ రాజశేఖర్‌తో కలసి పరిశీలించారు. ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌తో సమీక్షించారు. కార్యక్రమంలో టూరిజం ఆర్‌డీ వి.స్వామినాయుడు, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఎస్.సనత్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలోని జేఎన్‌టీయూకే



ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వీసీ ఆచార్య పద్మరాజుతో సమీక్షిస్తున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత



'నన్నయ' వర్సిటీ స్నాతకోత్సవం జరిగే ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్

ప్రతి విద్యార్థికీ సమాచారం ఇచ్చాం



స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ప్రతి విద్యార్థికీ వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చాం. హాజరయ్యేవారి వివరాలు ముందుగానే తీసుకున్నాం. నా మూడేళ్ల పదవీ కాలంలో క్రమం తప్పకుండా మూడు స్నాతకోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉప కులపతి, జేఎన్‌టీయూకే

కట్టుదిట్టంగా చర్యలు



గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన నేపథ్యంలో 'నన్నయ' వర్సిటీ స్నాతకోత్సవానికి భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. గవర్నర్ గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో హెలికాప్టర్ దిగి, నేరుగా వర్సిటీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే 13, 14, 15 స్నాతకోత్సవంలో పాల్గొంటారు.

– ఆచార్య కె.పద్మరాజు, ఉప కులపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

క్లుప్తంగా

అరుదైన పక్షి ప్రత్యక్షం


తునిలో కనువిందు చేసిన గూడ్లగూబ

తుని: అరుదైన పక్షి తుని పట్టణ సమీపంలోని మామిడి తోటలో ప్రత్యక్షమైంది. సోమవారం సాయంత్రం తుని నాసా స్వచ్ఛంద సంస్థ దగ్గర ఓ రైతుకు కనిపించింది. అప్పటికే దాని రెక్కకు గాయం కావడంతో చెట్టు నుంచి కింద పడి కదలలేని స్థితిలో ఉంది. గూడ్లగూబ జాతికి చెందినదిగా గుర్తించారు. జువాలజీ ఉపాధ్యాయుడు ఎం.సుధాకర్ పక్షిని పరిశీలించారు. ఇది గూడ్లగూబ జాతికి చెందినదని, దక్షిణ భారతదేశంలో తెలంగాణా, ఏపీలో ఎక్కువగా ఇవి సంచరిస్తాయన్నా రు. సాధారణంగా గూడ్లగూబ చిన్నదిగా ఉంటుంది. ఇది మాత్రం చాలా పెద్దదిగా ఉంది. వింత ఆకారంలో ఉన్న పక్షిని చూడడానికి జనం ఎగబడ్డారు.

పేలిన ఎలక్ట్రికల్ వాహనం


పేలుడుకు గురైన ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనం

కాకినాడ క్రైం: చార్జింగ్ పెడుతుండగా ఓ ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనం పేలిపోయింది. దీంతో ఇంట్లోని ఖరీదైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. కాకినాడ జగన్నాథపురం ఏడీఎఫ్ఓ ఏసుబాబు కథనం మేరకు.. జగన్నాథపురం మహాలక్ష్మినగర్‌కు చెందిన రమేష్ కొద్ది నెలల కిందట ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశారు. సోమవారం ఇంటి వద్ద ఈ వాహనానికి ఛార్జింగ్ పెడుతుండగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ధాటికి సమీపంలోని ఫ్రిజ్, టీవీ తునాతునకయ్యాయి. ప్రమాదంలో యజమాని గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఏసుబాబు ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఏడీఎఫ్ఓ తెలిపారు.

ఆడ పిల్లలను చదివించా



మాది పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామం. నా పేరు పంతం శ్రీలక్ష్మి. మాకు ముగ్గురు పిల్లలు. వారిలో ఇద్దరు ఆడ పిల్లలు. మగ పిల్లవాడు మానసిక వికలాంగుడు. మా ఆయన పంతం సత్యనారాయణ కూలి పనులకు వెళుతుంటారు. ఆడ పిల్లలకు చదువంటే చాలా ఇష్టం. కానీ చదివించే స్తోమత లేదు. టెన్త్ తర్వాత వారిద్దరి చదువు ఆపేద్దాం అనుకున్నాం. ఈ సమయంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. డ్వాక్రా రుణాలను రద్దు చేస్తానని ఎన్నికల్లో ఆయన హామీ ఇచ్చారు. ఇది జరుగుతుందా? అని మొదట్లో సందేహించాం. కానీ జగన్ సీఎం అయిన రెండో ఏడాది మొదటి విడత రుణ మాఫీ కింద నాకు రూ.20 వేలు జమ అయ్యింది. ఆ సొమ్ముతో పెద్ద కుమార్తెను డిగ్రీ చదివించాను. రెండో అమ్మాయిని ఇంజినీరింగ్‌లో చేర్పించాను. జగనన్న రుణ మాఫీ సొమ్ము ఇద్దరు ఆడ పిల్లల చదువుకు ఉపయోగపడింది. సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది. పెద్ద పాప చదువు ఇప్పటికే పూర్తయ్యింది. రెండో కుమార్తె చదువు కొనసాగుతోంది. కుమారుడికి వైద్యం చేయించుకుంటున్నాం. ఈ రుణ మాఫీ మా కుటుంబానికి పెద్ద మేలు చేసింది.

– పంతం శ్రీలక్ష్మి, డ్వాక్రా మహిళ, అన్నవరప్పాడు, పెరవలి మండలం, తూర్పుగోదావరి జిల్లా

కుటుంబానికి భరోసా


సంపరలో వైఎస్సార్ ఆసరా పథకంతో ఏర్పాటు చేసుకున్న కిరాణ్ షాపులో అద్దంకి పార్వతి

వైఎస్సార్ ఆసరా ఆ కుటుంబానికి భరోసాగా నిలిచింది. కాకినాడ జిల్లా పెదపూడి మండలం సంపర గ్రామానికి చెందిన అద్దంకి పార్వతికి భర్త సత్తిబాబు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్ ఆసరా మంజూరు కావడంతో పార్వతి నాలుగేళ్ల క్రితం కిరాణా షాపు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి సాగిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏడాదికి రూ.19 వేల చొప్పున పార్వతి బ్యాంకు ఖాతాకు నాలుగు విడతలుగా మొత్తం రూ.76 వేలు జమయ్యాయి. పార్వతి కాపు నేస్తం పథకం మూడుసార్లు అందుకున్నారు. పిల్లలకు జగనన్న విద్యా దీవెన పథకం అందింది. సీఎం జగన్ వల్లనే తమ కుటుంబానికి భరోసా లభించిందని పార్వతి ఆనందంగా చెబుతున్నారు.

నిప్పుతో చెలగాటం

కాకినాడ క్రైం: సిగరెట్ కాల్చుతూ తన బైక్‌లో పెట్రోలు పోస్తుండగా అగ్ని కీలలు రేగి ఓ యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. కొవ్వాడకు చెందిన పాలూరి బాలసుబ్రహ్మణ్యం (32) తండ్రి కొద్ది రోజుల కిందట చనిపోవడంతో కూలి పనులు చేస్తూ తన తల్లి శేషగిరితో కలసి నివసిస్తున్నాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో గంగనాపల్లి వద్దకు వచ్చేసరికి పెట్రోలు అయిపోయింది. సమీపంలో ఉన్న పెట్రోల్ బంకుకు వెళ్లి సుబ్రహ్మణ్యం ఖాళీ సీసాలో పెట్రోలు తెచ్చాడు. అనంతరం సిగరెట్ వెలిగించి పెదాల మధ్య ఉంచి సీసా మూత తెరిచి వాహనం ట్యాంకులో పెట్రోల్ పోస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు.

గురుకులం పిలుస్తోంది

- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఫిబ్రవరి 23 దరఖాస్తుకు తుది గడువు
- మార్చి 10న ప్రవేశ పరీక్ష


గురుకుల పాఠశాల

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. పేద, మధ్య తరగతి, అల్పాదాయ వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి ఈ నెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్పొరేట్ తరహాలో..ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేస్తారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఫిబ్రవరి 23వ తేదీ తుది గడువుగా ప్రభుత్వం ప్రకటించింది. సీటు సాధిస్తే వసతితో పాటు ఇంటర్మీడియెట్ వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. నీట్/ఐఐటీలో ఉచితంగా శిక్షణ కూడా ఇస్తారు. ఇందులో రాణిస్తే బాలురకు కర్నూలు (చిన్నటేకూర్), గుంటూరు(అడివి తక్కెళ్ల పాడు), బాలికలకు విజయవాడ(ఈడ్పుగల్లు) గురుకులాల్లో నీట్, ఐఐటీలకు శిక్షణ ఇస్తారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 700 సీట్లు కేటాయిస్తారు.

గతేడాది మెరుగైన ప్రతిభ

విద్యార్థులు మార్చి 10న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. గత విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాలలో చదివిన 68 మంది విద్యార్థులు దేశంలోని పలు ప్రముఖ ఐఐటీ, ఎన్ఐటీ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పొందడం గమనార్హం. 44 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు పొందడం ద్వారా గురుకుల పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలిచాయి.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ..

తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 21 గురుకులాలున్నాయి. అనపర్తి మండలంలోని కొత్తూరు జూనియర్ కళాశాల మినహా మిగిలిన 20 గురుకులాల్లో ఐదవ తరగతికి 80 సీట్లు వంతున 1,600, తుని మండలం లోవకొత్తూరులోని ఉన్న పాఠశాల మినహా మిగిలిన 20 జూనియర్ కళాశాలల్లో 1,600 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలికలకు 16, బాలురకు 5 గురుకుల పాఠశాలలున్నాయి. కాకినాడ జిల్లాలో తొమ్మిది, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఆరు వంతున గురుకుల పాఠశాలలున్నాయి.

అర్హతలివీ..

జూనియర్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షకు హాజరవుతున్నవారు అర్హులు. వయసు 31–08–2024 నాటికి 17 సంవత్సరాలు దాటకూడదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాది పాటు సడలింపు ఉంటుంది. ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01–09–2011 నుంచి 31–08–2015 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీ–సీ) విద్యార్థులు 01–09–2013 నుంచి 31–08–2015 మధ్య జన్మించి ఉండాలి. విద్యార్థులు సొంత జిల్లాలో 2022–23 ఏడాదిలో 3వ తరగతి, 2023–24 ఏడాదిలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి. ఇంటర్‌లో ప్రవేశానికి 10వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో చదువుతూ ఉండాలి. ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోనున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

ప్రవేశ పరీక్ష ఇలా..

గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షను నాల్గవ తరగతి సిలబస్‌ను అనుసరించి ఉంటుంది. తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై ప్రశ్నలు ఇస్తారు. తెలుగు సబ్జెక్టుకు 10 ప్రశ్నలకు 10 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 10 ప్రశ్నలకు 10 మార్కులు, గణితం 10 ప్రశ్నలకు 10 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ 10 ప్రశ్నలకు 10 మార్కులు, సోషల్ 10 మార్కులకు 10 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం మీద 50 మార్కులకు ప్రశ్నపత్రం ఇస్తారు. ఇంటర్‌లో ప్రవేశానికి 10వ తరగతి వరకు ఉన్న సిలబస్‌పై ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో 100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

ఎంపిక విధానం

2024–25 విద్యా సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న బాలురు, బాలికలకు ప్రవేశ పరీక్షను మార్చి 10న నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఇంటర్ ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా గురుకుల విద్యాలయాల్లో సీట్లు కేటాయిస్తారు.

దరఖాస్తులిలా..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఫిబ్రవరి 23 సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలను తప్పనిసరిగా రాయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తర్వాత మార్చుకోవడానికి అవకాశం లేదు. దరఖాస్తు చేయడానికి ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. విద్యార్థులు దగ్గరలోని ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ లేదా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం ద్వారా దరఖాస్తులు సమర్పించాలి.

రిజర్వేషన్ వివరాలు

అన్ని గురుకుల విద్యాలయాల్లో ఎస్సీలకు 75 శాతం, బీసీ–సీ(కన్వర్టడ్ క్రిస్టియన్స్) 12శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీలకు ఐదు శాతం, ఇతరులకు రెండు శాతం సీట్లు కేటాయిస్తారు. ప్రత్యేక కేటగిరి (ప్రమాదకర కర్మాగారాల్లో పని నుంచి తీసివేసిన పిల్లలు, జోగినులు, బసవిన్లు, అనాథలు, అత్యాచార బాధితులు, సైనిక ఉద్యోగస్తుల పిల్లలు) కింద 15శాతం సీట్లు కేటాయిస్తారు. అటువంటి వారు సర్టిఫికెట్స్ జతపర్చాలి. దివ్యాంగులకు మూడు శాతం సీట్లు కేటాయిస్తారు. ఏదైనా కేటగిరీలో సీట్లు భర్తీ కాకుంటే ఎస్సీ కేటగిరి విద్యార్థులకు కేటాయిస్తారు. ప్రతి కేటగిరిలో మూడు శాతం సీట్లు సఫాయి కర్మచారి విద్యార్థులకు కేటాయిస్తారు.

ఐదో తరగతి గురుకుల పాఠశాలలు

తూర్పుగోదావరి జిల్లా
కొవ్వూరు, గోపాలపురం, లక్ష్మీనరసాపురం, కొత్తూరు, బొమ్మూరు, వీరలంకపల్లి.

కాకినాడ జిల్లా
పిఠాపురం, సాంబమూర్తినగర్, పి.వెంకటాపురం, జగ్గంపేట, ఏలేశ్వరం, ఎ.మల్లవరం, లోవకొత్తూరు(బాలురు), వెలమకొత్తూరు(బాలికలు), చొల్లంగిపేట

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా
గోడి(బాలురు), గోడి(బాలికలు), రాజోలు, ద్రాక్షారామ, నరేంద్రపురం, ముమ్మిడివరం
పదో తరగతి, ఇంటర్ గురుకుల పాఠశాలలు ఇలా

సద్వినియోగం చేసుకోవాలి



గురుకులాల్లో ఐదు, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నోముల సంజీవరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, ఏపీ సాంఘిక సంక్షేమ వసతి, విద్యాసంస్థలు, కాకినాడ.

బాధ్యత తీసుకోవాలి



ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి బాధ్యత తీసుకోవాలి.

– జి.నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

విద్యార్థిని హెచ్‌ఎం కొట్టారంటూ పేరెంట్స్ ధర్నా


పాశర్లపూడిలంకలో ధర్నా చేస్తున్న పేరెంట్స్

మామిడికుదురు: పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 7వ తరగతి విద్యార్థిని కొట్టారంటూ పేరెంట్స్ సోమవారం ధర్నా చేశారు. 7వ తరగతి చదువుతున్న గుడిమెళ్లంక నిఖిల్ మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్తుండగా హెచ్‌ఎం ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్ ఆపి ఇంటికి వెళ్లడానికి వీల్లేదని జుట్టు పట్టుకుని కొట్టాడని విద్యార్థి తండ్రి గుడిమెళ్లంక కాశీ ఆరోపించారు. తన కొడుక్కి నుదురుపై దెబ్బ తగిలిందని, వాంతులు కావడంతో అతనికి ఆర్‌ఎంపీతో వైద్యం చేయించానని తెలిపారు. తన కొడుకును కొట్టాల్సిన పనేమిటంటూ హెచ్‌ఎం దుర్గాప్రసాద్‌ను విద్యార్థి తండ్రి కాశీతో పాటు పలువురు పేరెంట్స్ నిలదీశారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలంటూ పాఠశాల ప్రాంగణంలో ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న డీఈఓ ఎం.కమలకుమారి అక్కడకు చేరుకున్నారు. దీనిపై పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

రావులపాలెంలో రోడ్డు ప్రమాదం

ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

రావులపాలెం: జాతీయ రహదారిపై రావులపాలెంలోని డిగ్రీ కళాశాల సమీపంలో సోమవారం అర్ధ రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. ఆకివీడుకు చెందిన ట్రాన్స్‌పోర్టు లారీ.. లోడుతో రాజమహేంద్రవరం వైపు రావులపాలెం వైపు వస్తోంది. స్థానిక డిగ్రీ కళాశాల సమీపానికి వచ్చేసరికీ సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో లారీని రోడ్డుపై నిలిపి డ్రైవర్, క్లీనర్ వెనుకకు వచ్చి పరిశీలిస్తున్నారు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు గ్రావెల్‌తో వస్తున్న టిప్పర్ దానిని ఢీకొంది. ఈ విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది రెండు క్రేన్లతో సుమారు గంట సేపు తీవ్ర ప్రయత్నం చేసి ఎట్టకేలకు లారీలను విడదీశారు. ఈ ఘటనలో లోడు లారీకి చెందిన డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్, క్లీనర్‌ను ఎట్టకేలకు బయటకు తీశారు. వారిని 108, హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. టిప్పర్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్, క్లీనర్లను బొబ్బర్లంకకు చెందిన రవి, పండుగా గుర్తించారు.

వేటూరికి మరెవరూ సాటి రారు

- సినీ రచయిత, దర్శకుడు జేకే భారవి
- తునిలో వైభవంగా వేటూరి జన్మదిన వేడుకలు
- భారవికి వేటూరి కవితా పురస్కారం ప్రదానం


వేటూరి అవార్డును దైవంగా భావించి శిరస్సుపై పెట్టుకున్న భారవి

తుని: సహజత్వానికి నిలువెత్తు నిదర్శనం సినీ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి అని తెలుగు సినీ, పాటల రచయిత, దర్శకుడు జేకే భారవి కొనియాడారు. కలలు చెదిరినా, కలత చెందినా, ఎలాంటి భావాన్నయినా పలికించే శక్తి, యుక్తి ఆయనకే సొంతమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో ఆడుకోవడం వేటూరికి సర్వసాధారణమని అన్నారు. తుని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన వేటూరి 89వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ మాట్లాడుతూ, వేటూరికి తుని, పాయకరావుపేట పట్టణాల్లో ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకొని సాహితీ పీఠం ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకూ తెలుగు సినీ చరిత్రలో రచనలో నిష్ణాతులైన 12 మందికి వేటూరి అవార్డును అందజేశామని, 13వ సారి భారవికి ప్రదానం చేయడం ఆనందంగా ఉందని శర్మ అన్నారు. వేద పండితులు, మేళతాళాలతో భారవికి వేటూరి పురస్కారాన్ని అందజేశారు. వేటూరి పట్ల ఉన్న అభిమానాన్ని చాటి చెప్పే విధంగా 150 పుస్తకాలను భారవికి అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత భారవి మాట్లాడుతూ వేటూరి సాహిత్యం సహజత్వానికి దగ్గర ఉంటుందని, ఇది మరో ఎవరికి సాధ్యం కాలేదన్నారు. వేటూరితో ఉన్న పరిచయం తక్కువైనా ఎక్కువ నేర్చుకున్నానని, అటువంటి మహోన్నతి కవి పురస్కారం అందుకోవడం జీవితంలో మరువలేనని ఆనంద భాష్పాలతో అన్నారు. నేటి యువ గాయకులకు, గేయ రచయితలకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. సరస్వతిని కొలిస్తే వచ్చే జ్ఞానం మనల్ని కాపాడటమే కాదు భూమిని రక్షిస్తుందన్నారు. ఆది శంకరాచార్య, అన్నమయ్య, శ్రీరామదాసు, మంజునాథ సినిమాలు నాకు ఎంతో గుర్తింపునిచ్చాయన్నారు. ఎక్కడో పుట్టిన కవికి తునిలో వేడుకలు జరపుతున్నారంటే సాహిత్యానికి తుని ప్రజలు ఇస్తోన్న గౌరవాన్ని యువత అందిపుచ్చుకోవాలన్నారు. తొలుత వేటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా తాతబాబు, అన్నవరం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్రమోహన్, రసమాధురి వ్యవస్థాపకులు పి. సీతారామ ప్రభువు, తుని, పాయకరావుపేటకు చెందిన ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

అయ్యవరంలో పులి పాదముద్రలు

- అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు
- ఆయిల్‌పామ్, కోకో తోటలలో సీసీ కెమెరాల ఏర్పాటు
- రంగంలోకి శ్రీశైలం టైగర్‌జోన్ బృందం


అయ్యవరంలో పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు


పాదముద్రలు కొలతలు తీస్తున్న సిబ్బంది

నల్లజర్ల: మండలంలోని అయ్యవరంలో విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఉన్న ఆయిల్ పామ్ తోటలో పులిపాద ముద్రలు సోమవారం ఉదయం రైతులు గుర్తించారు. ఈ విషయాన్ని సర్పంచ్ వీరాస్వామితో పాటు రైతులు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. డీఎఫ్ఓ రవీంద్ర ధామా సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకొని పులి పాదముద్రలు పరిశీలించారు. పక్కనే ఉన్న కోకో తోటలో కూడా పాదముద్రలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పులి అయ్యవరం పరిసరాల నుంచి జి.కొత్తపల్లి వైపు వెళ్లినట్టు పాదముద్రల ద్వారా గుర్తించారు. పొలం సరిహద్దులో వేసిన ఫెన్సింగ్ దూకినపుడు పులి వెంట్రుకలు దానికి చిక్కుకోగా.. అధికారులు గుర్తించి ఆ వెంట్రుకలు భద్రపర్చారు. ఒక్కో పాదముద్ర 15 సెంటీమీటరు ఉన్నట్టు గుర్తించారు. తడి నేలలో అయితే అది సాగి 18 సెంటీమీటర్లు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ అడుగుల వ్యత్యాసాన్ని బట్టి పులి 11 అడుగుల మగ పులిగా గుర్తించారు. పులిని పట్టుకోవడానికి శ్రీశైలం టైగర్ జోన్ బృందాన్ని రంగంలోకి దింపారు. ఆయిల్‌పామ్, కోకో తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పులి జాడలు లేవని, మళ్లీ ఇపుడే పులి ఆనవాళ్లు కనపడుతున్నాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. పశువులు, మేకలను ఆరుబయట ఉంచవద్దని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

రూ.40 లక్షలతో బీటీ రోడ్డు

అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం


సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో టోల్‌గేట్ వద్ద నుంచి సత్యగిరి జంక్షన్ వరకు గల బీటీ రోడ్డు పాడైనందున రూ.40 లక్షల వ్యయంతో కొత్తగా బీటీ రోడ్డు నిర్మించేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానించింది. దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం ప్రకాష్ సదన్ సత్రంలోని ట్రస్ట్‌బోర్డు హాలులో ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ పాల్గొన్నారు.

ముఖ్యమైన తీర్మానాలు

- టోల్‌గేట్ వద్ద గల కొండ నుంచి రత్నగిరికి రెండో మెట్లదారి నిర్మాణానికి గాను గతంలో ప్రతిపాదించిన అంచనా వ్యయాన్ని రూ.85 లక్షల నుంచి రూ.90 లక్షలకు పెంపు
- సత్యగిరిపై శివసదన్ సత్రంలో గల 20 సూట్ రూమ్స్ (కార్నర్ రూమ్స్) అద్దె రూ.2,240 నుంచి రూ.2,800 కు పెంపు
- శివసదన్ సత్రంలో 135 గదులులలో బస చేసే భక్తులకు దుప్పట్లతో బాటు రగ్గుల సరఫరా
- దేవస్థానం విద్యాసంస్థల్లో సిబ్బందికి మార్చి 31 వరకు జీతభత్యాలు చెల్లించేందుకు అదనంగా అవసరమయ్యే రూ.90 లక్షల ఖర్చుకు సప్లిమెంటరీ బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనకు ఆమోదం
- ఆదిశంకర మార్గ్ రోడ్డు రక్షణకు రూ.11.9 లక్షలతో ' క్రాష్ బేరియర్స్' నిర్మించేందుకు టెండర్ ఆమోదం
- ప్రకాష్ సదన్ సత్రం పక్కన నిర్మించిన ర్యాంపుపై బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.తొమ్మిది లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచేందుకు నిర్ణయం
- శంఖవరంలోని ఉమా మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో రూ.26 లక్షలతో అభివృద్ధి పనులకు
- ఫిబ్రవరి 20న భీష్మ ఏకాదశి సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో రూ.3.20 లక్షలతో పుష్పాలంకరణ చేసేందుకు తీర్మానం

చికిత్స పొందుతూ బాలుడి మృతి

చాగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం ఉనగట్ల గ్రామంలో జరిగిన మోటారు సైకిల్ ప్రమాదంలో బ్రాహ్మణగూడెంకి చెందిన ఎల్లే వెంకటకృష్ణ కుమారుడు రుషిత్(10) తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రుషిత్ మృతి చెందినట్లు ఎస్సై టి. నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకట కృష్ణ కుటుంబ సభ్యులతో మోటారు సైకిల్ పై ప్రయాణం చేస్తుండగా ఉనగట్ల వద్ద ఎదురుగా వచ్చిన మరో మోటారుసైకిల్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రుషిత్‌కి తీవ్ర గాయాలయ్యాయి. చిన్న వయసులోనే దుర్మణం పాలైన రుషిత్‌ను తలచుకొని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.